

# జీరో బడ్జెట్ పాలిటిక్స్ సాధ్యమే!



**రేయింబవళ్లు కష్టపడి చదివే విద్యార్థి.. పరీక్షల్లో పాసవ్వడానికి కాపీ కొట్టడు. కఠోర శ్రమతో ప్రాక్టిస్ చేసే ఆటగాడు.. గెలుపు కోసం డ్రగ్స్ వాడడు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి.. బ్యాలెట్‌తో గెలవడానికంటే ముందు.. ప్రజల మనసుల్ని గెలవాలి. అప్పుడు డబ్బు, మద్యం పంచే అవసరమే రాదు.. అంటోంది 'జీరో బడ్జెట్ పాలిటిక్స్'. తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్న పి.మాధవరెడ్డి మాటల్లో ఆ విలువల రాజకీయం..**

'జీరో బడ్జెట్ వ్యవసాయం' అనేమాట విని ఉంటారు. జీరో అన్నంతమాత్రాన... నయాపైసా ఖర్చు పెట్టకుండా జరిగే ప్రక్రియ కాదు. జీరో ఫర్టిలైజర్, జీరో ఇన్వెస్ట్‌మెంట్‌లతో చేసే వ్యవసాయం. అంటే, ఇక్కడ భూమి, విత్తనాలు, నీళ్లు, శ్రమ ఉంటాయి. ఆ ప్రకారంగా, అవసరం లేనివి ఉండవు, అవసరమున్నవే ఉంటాయి. అదే జీరో బడ్జెట్! వ్యవసాయానికే కాదు, నేటి రాజకీయాలకూ వర్తిస్తుందీ సూత్రం. ఏళ్ల తరబడి రాజకీయాల్లో ఉన్న నాయకుడు గెలవడానికి ప్రచారం అవసరమా? అనేదే నా ప్రశ్న. ఏ నియోజకవర్గమైనా మహా అంటే యాభై కిలోమీటర్ల పరిధి, అందులో వంద గ్రామాలు ఉంటాయి. ఏ ఊళ్లో అయినా ప్రధానంగా ఐదు సమస్యలు కనిపిస్తాయి. అవి - తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్తు. గుండె మీద చేయి వేసుకుని చెప్పమనండి.. ఏ ఒక్క ప్రజాప్రతినిధి అయినా... తన ఐదేళ్ల పదవీకాలంలో... ఐదు పాఠశాలలు, ఐదు ప్రభుత్వ ఆస్పత్రులైనా పర్యవేక్షించారా? ఎన్నికలప్పుడు మాత్రమే పల్లెలకు వస్తారు. వారి దృష్టిలో... ప్రజలంటే ఓట్లు. ఆ ఓట్లు పడగానే ప్రజలను మరచిపోతారు.

**ప్రజలే పార్టీ ఫండ్...**

డబ్బుమయం అయిపోయిన రాజకీయాలను కొంతైనా సంస్కరించాలంటే.. జీరో బడ్జెట్ పాలిటిక్స్ ఒక్కటే మార్గం. అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కోట్లు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. జీరో బడ్జెట్‌తో గెలుపు ఎలా సాధ్యం? అనొచ్చు. కచ్చితంగా సాధ్యమే! ప్రజలతో మమేకమైన నేతకు ప్రచారమే అక్కర్లేదు. బిహార్‌లో శివప్రకాష్ అనే అభ్యర్థి జనం పోగు చేసిన చందాలతో గెలిచాడు. అదీ స్వతంత్ర అభ్యర్థిగా. ఆయనకు ప్రజలే తలా కొంత ఎన్నికల ఖర్చులకు ఇచ్చారు. ఆ మొత్తం రూ.1.40 లక్షలు. అందులో ప్రచారానికి పోను, ఇంకా ఇరవై వేలు మిగిల్చాడా నేత.

**మనసులు గెలిస్తే చాలు..**

జీరో బడ్జెట్ పాలిటిక్స్‌లో అభ్యర్థి కొన్ని లక్ష్యాలను పెట్టుకోవాలి. నిరుద్యోగుల ఉపాధి కోసం ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టింది. వాటిపై గ్రామాల్లో అవగాహన శిబిరాలను ఏర్పాటు చేయవచ్చు. పెద్ద సంస్థలతో మాట్లాడి పల్లెల్లోనే కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులను ఏకంచేసి, వాళ్ల ఆర్థిక సహాయంతో.. బల్లలు, కుర్చీలను అందించవచ్చు. హంగూ ఆర్భాటాలకు పోకుండా.. ప్రచారానికి ఖర్చు పెట్టే మొత్తంతో.. మంచి నీటి కొళాయిలు బిగించవచ్చు. గ్రంథాలయం ఏర్పాటు చేయవచ్చు. ఇలాంటి పనులు చేస్తే, ఆ నేతను ప్రజలు జీవితాంతం గుండెల్లో పెట్టుకుంటారు. ప్రత్యర్థులు ఎంత ఖరీదైన ప్రచారం చేపట్టినా.. మంచి చేసిన వాళ్లకే ఓటేస్తారు ప్రజలు. జీరో బడ్జెట్ అంటే.. ప్రజల అవసరాలను తీర్చి.. మెప్పు పొంది గెలవడం. డబ్బు పంచి గట్టెక్కడం కాదు.

**పంచుతారు.. తింటారు..**

మదర్‌థెరిస్సా, గాంధీ వంటి మహామహుల వల్ల నేరుగా మనకేమీ లాభం చేకూరలేదు. అయినా వారిని ఆరాధిస్తాం. ఎందుకంటే.. సమాజానికి పనికొచ్చే పనులు చేసి.. ఆదర్శంగా నిలిచారు కాబట్టి. జీరో బడ్జెట్ పాలిటిక్స్‌లో ఇలాంటి ఇమేజే అవసరం. ప్రజలంతా నా వాళ్లు అనుకున్నప్పుడే.. అంత పేరొస్తుంది. అయినా సరే, కొన్నిసార్లు ఓడిపోవచ్చు. గెలవకపోతేనేం, గౌరవం మాత్రం ఎక్కడికీ పోదు. డబ్బుతో గెలిచిన ప్రత్యర్థికి జనం మర్యాద ఇవ్వరు. దీర్ఘకాలంలో అతను ప్రజల మనసులను గెలుచుకోలేడు. డబ్బు ఖర్చు పెట్టి గెలిచిన నేతలు తీవ్రమైన ఒత్తిడితో ఉంటారు. తిరిగి ఆ డబ్బును వెనకేసుకోవాలంటే ఎంతో అవినీతి చేయాలి.

**కొత్తతరం కోసం..**

మా ఊళ్లో నేనే తొలి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్‌ను. ఎన్ఐటీ వరంగల్‌లో చదివాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని టెలికాం సంస్థలో పనిచేస్తున్నాను. మా సొంతూరు అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని వాసాపురం. జీరో బడ్జెట్ పాలిటిక్స్ పట్ల ఆకర్షితుడిని కావడానికి ప్రధాన కారణం వ్యాపారమయమైన నేటి రాజకీయాలే. పాలిటిక్స్ ధనవంతులకేనా? ప్రజల కోసం కష్టపడే సామాన్యులకు అవకాశం లేదా?... అనే ఆలోచనలలో నుంచి పుట్టుకొచ్చిందీ ఐడియా. డబ్బు, మద్యం, పదవులు, ప్రలోభాలు లేకుండా.. ప్రజాభిమానంతో గెలవడం ఎలా? అనే అంశం మీద ఓ డాక్యుమెంట్ తయారుచేశాను. హైదరాబాద్‌లో సెమినార్ పెడితే.. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి ఔత్సాహికులు తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో ఈ అంశంపై ప్రచారం చేస్తున్నా. పుణెలోని ప్రసిద్ధ పొలిటికల్ ఇన్‌స్టిట్యూట్ 'ఎంఐటీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్' కూడా ఏటా నన్ను ఆహ్వానిస్తోంది. రాజకీయ నాయకులు కావాలనుకునే వాళ్లకు నా ఉపన్యాసం ఎంతో ఉపకరిస్తోంది. కొత్తతరం నేతలు రావాలన్నదే నా లక్ష్యం. కొత్తరక్తంతోనే మార్పు సాధ్యం. ఇదే నా ఆశయం. ఆ వైపుగానే నా ప్రయత్నం.

**- సండే డెస్క్**

